### ప్రజలు అభివృద్ధిని కాంక్షించి

## బీఆర్ఎస్‌కు అండగా నిలిచారు..

**• బీఆర్ఎస్ గోషామహల్ అభ్యర్థి నందకిశోర్ వ్యాస్**



అబిడ్స్, నవంబర్ 30 : గోషామహల్ నియోజకవర్గం ప్రజలు అభివృద్ధిని కాంక్షిస్తూ బీఆర్ఎస్ పార్టీకి అండగా నిలిచారని ఆ పార్టీ గోషామహల్ నియోజకవర్గ అభ్యర్థి నందకిశోర్ వ్యాస్ పేర్కొన్నారు. గురువారం తన కార్యాలయంలో నందకిశోర్ వ్యాస్ విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుత ఎమ్మెల్యేపై ఉన్న వ్యతిరేకత, సీఎం కేసీఆర్ చేపట్టిన సంక్షేమ పథకాలతో ప్రజలు తనకు ఓట్లు వేసేందుకు ముందుకు వచ్చినట్లు తెలిపారు. ప్రజల సహకారంతో గోషామహల్ నియోజకవర్గం నుంచి తాను 25 వేల ఓట్ల మెజార్టీతో విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. 25 ఏండ్లుగా తాను నియోజకవర్గం ప్రజలకు అందుబాటులో ఉండి ఆదిత్య కృష్ణ ఛారిటబుల్ ట్రస్ట్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలను చేపడుతున్నట్లు తెలిపారు. ప్రజల సహకారంతో విజయం సాధించి వాడవాడలా అభివృద్ధి పనులను చేపట్టి, ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. గోషామహల్ నియోజకవర్గ ప్రజలకు నందకిషోర్ వ్యాస్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

### ఓటు వేశారు..



ఓటు హక్కు వినియోగించుకున్న టీఎన్జీవో హైదరాబాద్ జిల్లా శాఖ అధ్యక్షుడు డాక్టర్ ఎస్ఎం ముజీబ్‌హుస్సేనీ – సుల్తాన్‌బజార్



ఓటు హక్కు వినియోగించుకున్న బీఆర్ఎస్ గన్‌ఫౌండ్రీ మాజీ కార్పొరేటర్ మమతాసంతోష్ గుప్తా దంపతులు – సుల్తాన్‌బజార్



ఓటు వేసిన బీఆర్ఎస్ మహిళా నాయకురాలు ప్రియాగుప్తా, తదితరులు – అబిడ్స్

### పటిష్ట బందోబస్తు




గోషామహల్ నియోజకవర్గంలో బందోబస్తు నిర్వహిస్తున్న ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ బలగాలు – అబిడ్స్

# గోషామహల్‌లో ప్రశాంతంగా ఎన్నికలు

**• 49 శాతం పోలింగ్ నమోదు**

అబిడ్స్, సుల్తాన్‌బజార్, నవంబర్ 30 : గోషామహల్ నియోజకవర్గంలో స్వల్ప సంఘటనలు మినహా ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. నియోజకవర్గంలో 2,70,622 ఓటర్లలో దాదాపు 49శాతం మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉదయం ఏడు గంటలకు ప్రారంభమైన పోలింగ్ మధ్యాహ్నం వరకు మందకొడిగా సాగగా ఆ తరువాత పుంజకుంది. కొన్ని ప్రాంతాలలో ఈవీఎంలు మొరాయించడంతో రిటర్నింగ్ అధికారి వి విక్టర్ వెంటనే స్పందించి ఈవీఎంలను మార్చి తిరిగి పోలింగ్ జరిగేలా చర్యలు తీసుకున్నారు. కొన్ని ప్రాంతాలలో ఓటర్లు ఓటర్ ఐడీ కార్డులతో ఓటు వేయడానికి రాగా ఓటరు జాబితాలో పేర్లు లేవని చెప్పడంతో అవాక్కయ్యారు. గోషామహల్ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి నందకిశోర్ వ్యాస్, బీజేపీ అభ్యర్థి టి రాజాసింగ్, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మొగిలి సునీతరావుతో పాటు అభ్యర్థులు నియోజకవర్గంలో తిరిగి పోలింగ్ సరళిని పరిశీలించారు. నియోజకవర్గంలో దాదాపు 1,32,604 ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నట్లు సమాచారం. నియోజకవర్గంలోని గన్‌ఫౌండ్రి, జాంబాగ్, గోషామహల్, మంగళ్‌హాట్, బేగంబజార్, దత్తాత్రేయనగర్ డివిజన్లలో ఉదయం తొమ్మిది గంటల వరకు కేవలం 2.89 శాతం మాత్రమే పోలింగ్ నమోదు కాగా 11 గంటల ప్రాంతంలో 13.64 శాతం, మధ్యాహ్నం ఒంటి గంట వరకు 15.83, మూడు గంటల వరకు 35.88 శాతం, సాయంత్రం 5 గంటల వరకు 45.79 శాతం నమోదైనట్లు రిటర్నింగ్ అధికారి వి విక్టర్ తెలిపారు.



బేగంబజార్‌లో ఓటు వేసిన బీఆర్ఎస్ గోషామహల్ నియోజకవర్గ అభ్యర్థి నందకిశోర్ వ్యాస్



ఓటు హక్కు వినియోగించుకున్న యువతులు

ఇదిలా ఉండగా గోడేకిఖబర్, శివలాల్‌నగర్, ఇందిరానగర్, గోషామహల్, బేగంబజార్ ప్రాంతాల్లో స్వల్ప ఉద్రిక్తత చోటు చేసుకుంది. పోలింగ్ కేంద్రాల వద్ద పోలీసులు బందోబస్తును ఏర్పాటు చేశారు. ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటిక్ సర్వేలెన్స్ టీం, ఇతర దళాలు నియోజకవర్గంలో పెట్రోలింగ్ నిర్వహించి ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు చర్యలు తీసుకున్నారు. గోషామహల్ నోడల్ అధికారి, గోషామహల్ ఏసీపీ కోట్ల వెంకట్‌రెడ్డి నేతృత్వంలో పోలీసులు బందోబస్తును పర్యవేక్షించారు. ఎన్నికలు ముగిసిన తరువాత పోలింగ్ కేంద్రాల్లోని ఈవీఎం, వీవీప్యాట్‌లను అధికారులు సీజ్ చేసి కోఠి మహిళా కళాశాలలోని డీఆర్‌సీ సెంటర్‌లో స్ట్రాంగ్‌రూంకు తరలించారు.

**సెంట్రల్ జోన్ ఇన్‌చార్జి డీసీపీ డీ. శ్రీనివాస్‌గుప్తా పర్యవేక్షణ**

సెంట్రల్ జోన్ ఇన్‌చార్జి డీసీపీ డీ శ్రీనివాస్ గుప్తా, అబిడ్స్ ఏసీపీ ఎ చంద్రశేఖర్ తమ సిబ్బందితో గోషామహల్ నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి డీసీపీ మాట్లాడుతూ ప్రజలు స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు హక్కును వినియోగించుకునే విధంగా అన్ని చర్యలు తీసుకున్నామని అన్నారు.



కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కు వినియోగించుకున్న బీఆర్ఎస్ నాయకుడు ఎం. ఆనంద్‌కుమార్‌గౌడ్



నాంపల్లిలో ఓటు వేసిన బీఆర్ఎస్ మహిళా నాయకురాలు శాంతిదేవి, ప్రేమ్ అగర్వాల్

# కార్వాన్‌లో 40.49 శాతం ఓటింగ్

కార్వాన్, నవంబర్ 30 : కార్వాన్ నియోజకవర్గంలో అసెంబ్లీ ఎన్నికల్లో ఓటు వేసేందుకు ప్రజలు పెద్దగా ఆసక్తి కనబరచలేదు. గురువారం ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రక్రియ ప్రారంభం కాగా కేంద్రాల్లో ఓటర్లు పెద్దగా కనిపించలేదు. కార్వాన్ నియోజకవర్గంలో మొత్తం 7 డివిజన్లలో ఓటింగ్ శాతం తగ్గడంతో సాయంత్రం 5 గంటలకు ఓటింగ్ ముగిసే సమయానికి 40.49 శాతంగా పోలింగ్ నమోదైనట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి డి. కొమరయ్య తెలిపారు. పోలింగ్ సందర్భంగా ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోలేదు. సౌత్ వెస్ట్ జోన్ డీసీపీ బాలస్వామి అధ్వర్యంలో టప్పాచబుత్రా, కుల్సుంపురా, లంగర్‌హౌస్, గోల్కొండ, గుడిమల్కాపూర్ పోలీస్‌స్టేషన్ల పరిధిలోని ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు సిబ్బందితో బందోబస్తు చేపట్టారు.



గుడిమల్కాపూర్‌లోని జీహెచ్‌ఎంసీ వార్డు కార్యాలయం వద్ద ఓటు వేసేందుకు క్యూ కట్టిన ప్రజలు

కాగా నియోజకవర్గంలో ఎంఐఎం అభ్యర్థి కౌసర్ మొయినుద్దీన్, బీఆర్ఎస్ అభ్యర్థి మిత్ర క్రిష్ణ, బీజేపీ అభ్యర్థి అమర్‌సింగ్, కాంగ్రెస్ అభ్యర్థి ఉస్మాన్ అల్ హజ్రీ తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. వివిధ ప్రాంతాల్లో పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఓటింగ్ సరళిని పరిశీలించారు.



కార్వాన్‌లో ఓటు వేసిన బీఆర్ఎస్ అభ్యర్థి మిత్ర క్రిష్ణ



కుల్సుంపురా ప్రభుత్వ పాఠశాల పోలింగ్ బూత్‌లో కనిపించని రద్దీ



పోలింగ్ తీరును పరిశీలించిన ఎంఐఎం కార్వాన్ అభ్యర్థి కౌసర్ మొయినుద్దీన్